క్లుప్తంగా

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలకు తరలిస్తున్న ఆ నలుగురు సమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందిన అనాథ వృద్ధుడి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు. ఆదివారం వన్‌టౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు అనాథ మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆ నలుగురు సేవా సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, నాయకులు కేశవ, రవీంద్ర, పురుషోత్తమ్, మహేష్,రాజేష్, సలీమ్‌ను పోలీసులు అభినందించారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



టీచర్ రామకృష్ణ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కె.రామకృష్ణకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎస్.సావిత్రమ్మ పర్యవేక్షణలో ఆయన 'స్టడీస్ ఆన్ సింథిసిస్ క్యారెక్టరైజేషన్ వాలిడేషన్ అండ్ అప్లికేషన్ ఆఫ్ నానోపార్టికల్స్ ఫ్రమ్ పైకస్ మొల్లిస్ వాహ్ల్-ఏ మెడిసినల్ ప్లాంట్ స్పిసిస్' అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందిన రామకృష్ణను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్‌నాయక్

శింగనమల: మండలంలోని శింగనమల, సి.బండమీదపల్లి, సోదనపల్లి, నిదనవాడ గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలడంతో ఆదివారం తరిమెల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపించిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తరిమెల పీహెచ్‌సీ వైద్యులు శంకర్‌నాయక్, తేజశ్విని, సీహెచ్‌ఓ గంగాధర్, సూపర్‌వైజర్లు అశ్వర్థనారాయణ, శ్రీధర్ మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళలను సన్మానిస్తున్న ఎంపీపీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు

గుత్తి: పట్టణంలోని శ్రీసాయి బాబా ఫంక్షన్ హాల్‌లో బలిజ సంఘం మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కందుల హేమలత ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ విశాలాక్షి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు బిందె వరలక్ష్మి, పద్మలతారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభా వంతులైన ఆరుగురు మహిళలను సన్మానించారు. అలాగే పట్టణంలో సీఐటీయూ , ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు.

గుంతకల్లుటౌన్: ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మణి, నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ, పట్టణ కార్యదర్శి మాబున్ని తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఐటీ'కి 3 అవార్డులు



అవార్డు అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: అటల్ ఇంక్యుబేషన్ మిషన్ ఎస్కే యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టార్టప్ జాతర- 2024లో వివిధ కేటగిరిల్లో మూడు ప్రతిష్టాత్మక అవార్డులను బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల దక్కించుకుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ ఆదివారం తెలిపారు. ఇనిస్టిట్యూట్ కేటగిరిలో స్టార్టప్ ఎకో సిస్టం ఎనేబుల్ విభాగంలో కళాశాలకు చెందిన ఐఅండ్‌ఈడీపీ సెల్ కన్వీనర్‌కు గౌరవనీయమైన అవార్డు దక్కింది. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన వరుణ్‌కు ఫ్యాకల్టీ మెంబర్ వ్యక్తిగత విభాగంలో అవార్డు అందుకున్నారు. చాకోమైట్ ప్రైవేట్ లిమిటెడ్ బిజినెస్ వెంటర్‌ను స్థాపించడంలో అత్యుత్తమ చొరవ చూపినందుకు ఉమెన్స్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ విభాగంలో ఈసీఈ చివరి సంవత్సరం విద్యార్థులు సుచిత్ర, సుజిత, సుమియాబేగం అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి అభినందించారు.

పేద కుటుంబాలకు 'సీఎంఆర్‌ఎఫ్' అండ



ఈ చిత్రంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు చూపుతున్న మహిళ పేరు షకినాబీ. ఊరు బందార్లపల్లి. 2023 మే నెలలో పదేళ్ల కూమారుడు దస్తగిరికి ఖత్నా ఆపరేషన్ చేయించింది. అది వికటించడం వల్ల తిరిగి బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించింది. ఆపరేషన్ కోసం అధికమొత్తంలో డబ్బు ఖర్చు అవడంతో పేద కుటుంబం తల్లడిల్లింది. సీఎంఆర్ ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంది. కొద్దిరోజులకు ప్రభుత్వం నుంచి రూ.1.60 లక్షలు మంజూరైన చెక్కును ఆమెకు ఎమ్మెల్యే అందజేశారు. ఆపరేషన్ కోసం చేసిన అప్పు జగనన్న దయవల్ల తీరిపోయిందని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉంటానని తెలిపింది.

- జగనన్న సాయం మరువలేమంటున్న లబ్ధిదారులు
- వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటామన్న పేదలు

పెద్దపప్పూరు: రోడ్డు ప్రమాదాల్లో గాయపడి కొందరు, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధితో మరి కొందరు... వివిధ అనారోగ్య సమస్యలతో ఆపరేషన్ల కోసం అందిన చోట్ల అప్పులు చేసి.. ఆ అప్పును ఎలా తీర్చాలో మధనపడుతున్న వారికి అపదలో మీకు నేను అండగా ఉన్నానంటూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలుస్తున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు తాడిపత్రి నియోజక వర్గంలోని పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాల్లోని దాదాపు 652 మందికి రూ.10 కోట్లకు పైగా విలువ చేసే చెక్కులను మంజూరు చేశారు. ఆ చెక్కులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వయంగా లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి అందజేశారు. ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడంతో లబ్ధిదారుల మనసుల్లో జగనన్న ఆపద్బాంధవుడిగా చెరగని ముద్రవేసుకున్నారు. తాము చేసిన అప్పుతీరడంతో పాటు ఆరోగ్యంగా ఉన్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం రాజకీయ పలుకుబడితో పాటు జన్మభూమి కమిటీ సభ్యులు ఎంపిక చేసిన వారికి మాత్రమే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసేవారని వారు గుర్తు చేస్తున్నారు. వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఎలాంటి రాజకీయాలు లేకుండా అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి (ఫైల్)

జగనన్న సాయం జన్మలో మరువలేను



కిరాణా కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాను. 2020 సెప్టెంబర్‌లో కూరగాయల కోసం తాడిపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా యరగుంటపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని కోలుకున్న తరువాత సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. కొద్ది రోజుల్లోనే స్వయంగా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నా కుటుంబసభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేశారు. జగనన్న చేసిన సాయాన్ని జన్మలో మరవలేను.

–మోహన్ రంగయ్య, ముచ్చుకోట, పెద్దపప్పూరు మండలం

కష్టాల్లో ఆదుకున్నారు



2023 జూన్‌లో జీవనోపాధిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా కిందపడ్డాను. తీవ్ర గాయాలైన నన్ను మా కుటుంబసభ్యులు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు బెంగుళూరుకు సిఫార్సు చేశారు.అక్కడికు వెళ్లి చికిత్స చేయించుకున్నాను. అందుకు అయిన ఖర్చును మంజూరు చేయాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న కొద్దిరోజులకే సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.30 వేల చెక్కును స్వయంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అందజేశారు. కష్టాల్లో ఆదుకున్న సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో గెలవాలి.

–భాస్కర్, కొండూరు, పెద్దవడుగూరు మండలం

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



చక్రాయిపేటలో ప్రచారం నిర్వహించిన సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: పేదలందరికీ సంక్షేమ పథకాలందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని చక్రాయిపేట, పోతురాజుకాల్వ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయన్నారు. కరోనా కష్ట కాలంలోనూ సీఎం సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగన్ పాలన సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం, సచివాలయ భవనాలు, నాడు-నేడు నిధులతో పాఠశాల భవనాలు రూపురేఖలు మారాయన్నారు. ఎన్నో సంవత్సరాలుగా హామీగా నిలిచిపోయిన శింగనమల చెరువును ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి లోకలైజేషన్ చేయించారన్నారు. దీంతో చెరువు కింద ఉన్న ప్రాంత రైతులు ఎంతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. అలాగే మత్స్యకారులు చేపల పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, నాగన్న, విజయ్‌రెడ్డి, శివారెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సక్సెస్‌తో ప్రతిపక్షాల వెన్నులో వణుకు



సిద్ధం సభను వీక్షిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: త్వరలో జరగనున్న సార్వత్రిక సమరానికి పార్టీ సైనికులను సమాయత్తం చేయడానికి వైఎస్సార్‌సీపీ లక్షలాది మందితో నిర్వహించిన సిద్ధం సభలు చూసి ప్రతిపక్ష పార్టీల వెన్నులో వణుకు పుట్టిందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో జరిగిన నాలుగు సిద్ధం సభలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. ఈ సభలు పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపాయన్నారు. ఆదివారం సాయంత్రం మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభను వీక్షించడానికి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భారీ ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వైవీఆర్‌తో పాటు పార్టీ శ్రేణులు పాల్గొని సిద్ధం సభను వీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరిక నిర్మూలన జరగాలన్నా, పేద పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు పడాలన్నా, వ్యవసాయం పండుగలా మారాలన్నా, విద్య, వైద్యం మెరుగుపడాలన్నా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థిని మంజునాథ్‌కు నగదు అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

యాడికి: అనంతపురంలోని స్వగృహంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈడిగ, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ గౌడ్ నిరుపేద ఎంబీబీఎస్ విద్యార్థి మంజునాథ్‌గౌడకు రూ. 60 వేల చెక్కు అందజేశారు. యాడికి ఆస్పత్రి కాలనీకి చెందిన మధుసూదన్ గౌడ కుమారుడు మంజునాథ్ ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఫీజు చెల్లించడానికి ఇబ్బంది పడుతుండడంతో కిరణ్‌కుమార్‌గౌడ్ రూ. 60 వేలు ఆర్థిక సహాయం చేశారు. భవిష్యత్‌లో కూడా ఆర్థిక సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మురళీమోహన్‌గౌడ, నాగరాజుగౌడ, దామోదర్‌గౌడ, ధనుంజయ గౌడ, నాగేంద్ర గౌడ, శ్రీనివాసులు గౌడ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈత పోటీల్లో రాష్ట్రస్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించడం గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామానికి చెందిన మోహన్‌కృష గౌడకు రూ. 15 వేలు ఆర్థికసాయం అందజేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఐదో ఆదివారం తిరునాల ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రధాన అర్చకుడు రామాచార్యులు ప్రత్యేకంగా అలంకరించి, ఏకవార రుద్రాభిషేకం చేసి, సహస్ర నామార్చన, ఆకుపూజ తదితర పూజలు చేశారు. మాఘమాసం చివరి వారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శనం చేసుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే 108 సాల గ్రామ శివలింగాలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఐదు వారాలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవతం చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నారాయణస్వామీ..శిరసాస్మరామి



అలంకరణలో అశ్వత్థ నారాయణుడు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో మాఘమాసం ఐదో ఆదివారం తిరుణాల కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వరుడి చుట్టూ నారాయణ స్వామి శిరసాస్మరామి అంటూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి వారికి ముడుపులు, కానులకలతోపాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు మొక్కుబడిలో భాగంగా అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యంలు సౌకర్యాలు కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ శరత్ చంద్ర బందోబస్తు పర్యవేక్షించారు.

చితంబరస్వామి రథోత్సవం



స్వామి రథోత్సవ దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని అవధూత చితంబర స్వామి తిరునాల గ్రామస్తులు మూడు రోజులు వైభవంగా నిర్వహించారు. జాగరణ మరుసటి రోజు చితంబరస్వామి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా వసంతోత్సవం



శివపార్వతులను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగమేశ్వర ఆలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న మహా శివరాత్రి ఉత్సవాలు వసంతోత్సవాలతో ముగిశాయి. ఆదివారం వేకువజామున ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో శ్రీవారి వసంతోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పార్వతీ బుగ్గ సంగమేశ్వరులతో పాటు వినాయక విగ్రహాలను ఆలయ కోనేటిలో పవిత్ర స్నానాలను చేయించి నూతన వస్త్రాలు, స్వర్ణాభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, యాడికి సర్కిల్ సీఐ రోషన్, ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండలంలోని అప్పేచర్ల, క్రిష్టిపాడు, పెద్దవడుగూరు గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ప్రభావితం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 25లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ చంద్రనాయక్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 5- 6 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తామన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి..

గార్లదిన్నె: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశానికి మంగళవారం నుంచి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ నాగసత్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్‌తో పాటు 7,8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీట్ల భర్తీలో అనాథ పిల్లలు, డ్రాపౌట్స్ విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికలకు ప్రాధాన్యతమిస్తామన్నారు. ఏప్రిల్ 11లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని కమాటం వీధికి చెందిన మంజుల అనే యువతి విష రసాయనం తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సార్వత్రిక సమరానికి సిద్ధంకండి



సిద్ధం ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న చైర్‌పర్సన్ ఎన్.భవాని

గుంతకల్లుటౌన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని సూచించారు. సీఎం వైఎస్.జగన్, ఎమ్మెల్యే వైవీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం 28వ వార్డులో మేము సిద్ధం–మా పోలింగ్ సిద్ధం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 54, 55 పోలింగ్ కేంద్రాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఎమ్మెల్యే వైవీఆర్ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించాలని ఆమె సూచించారు. ఓటర్లతో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించి పార్టీకి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎండీ.ఖలీల్, వార్డు సచివాలయ కన్వీనర్లు ఉమాపతి, జాఫర్, నాయకులు కార్గిల్‌సీనా, గోవిందు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్బీకేల ప్రారంభోత్సవం

గుంతకల్లు రూరల్: మండలంలోని నక్కనదొడ్డి, వైటీ చెరువు గ్రామాల్లో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు నక్కనదొడ్డి గ్రామం, ఉదయం 11.30 గంటలకు వైటీ చెరువులోనూ ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు.

నేడు 'చేయూత' సంబరాలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఫంక్షన్ హాలులో సాయంత్రం 3 గంటలకు 'వైఎస్సార్ చేయూత' నాలుగో విడత చెక్కును తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. చేయూత లబ్ధిదారులతో పాటు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని ఈఓఆర్‌డీ నాగేశ్వరశాస్త్రి సూచించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

యాడికి: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండలంలో పలు గ్రామాల్లో సోమవారం పర్యటించనున్నట్లు జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కోనుప్పలపాడులో గ్రామ సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. 2:30కు భోగాలకట్ట గామంలో నూతనంగా నిర్మించనున్న సీతారాముల ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. 3 గంటలకు కుప్పాలలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

నేడు సమన్వయకర్త ప్రచారం

శింగనమల: నార్పల మండలంలోని మద్దలపల్లి, నాయనపల్లి, వెంకటాంపల్లి, గడ్డం నాగేపల్లి, నడిమిదొడ్డి, కేశేపల్లి, కురగానిపల్లి, కర్లపాడికి, పూలసలనూతల, బొందలవాడ, నిలువురాయి, చాములూరు గ్రామాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వీరాంజనేయులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివరం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్లమెంట్ సమన్వయకర్త , ఎమ్మెల్యే శంకరనారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు తాడిపత్రి రమేష్‌రెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

గుంతకల్లుటౌన్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గంగానగర్‌కు చెందిన ఇరానీ తాలిబ్ వైద్యఖర్చులకు ఎమ్మెల్యే వైవీఆర్ ట్రస్ట్ ద్వారా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో కలసిన తాలిబ్ కుటుంబసభ్యులకు ఆర్థికసాయాన్ని అందజేసి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం పొందాలని ఆమె సూచించారు. ఎమ్మెల్యే వైవీఆర్, నైరుతిరెడ్డికి తాలిబ్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సావిత్రిభాయి పూలే ఆదర్శప్రాయం

గార్లదిన్నె: అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రి పూలే అని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుళ్లాయప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సావిత్రిబాయిపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆమె అలు పెరగని పోరాటం చేశారన్నారు.